కథాకాలం : 1989

# నిధి చాల సుఖమా?

"లక్షలు ఆదా చేయడం ఏమంత పెద్ద కష్టంకాదు. నిన్నటికి నిన్న 15 వేలు ఆదా చేశాను తెలుసా?"

వేడివేడి కాఫీని ఆరారగా సేవిస్తూ బెటరాఫ్ సుబ్బలక్ష్మితో అన్నాడు రాంబాబు.

సుబ్బలక్ష్మి తన సంతోషాన్ని కళ్ళతో దాచేంచింది. పక్కింటి రాధాభాయి మొన్ననే ఫ్రిజ్ కొంది. కింగ్ సైజు సబ్బుబిళ్ళలా ఫ్రిజ్ తళతళ లాడుతుంటే సుబ్బలక్ష్మికి ఏడుపొచ్చినంత పనై రాంబాబుని సతాయించింది. "లోపల యంత్రం లేకపోయినా ఫరవాలేదు. బీరువా లాగా వాడుకోవచ్చు. కనీసం ఫ్రిజ్‌లా కనిపిస్తేచాలు. రేకు డబ్బా అయినా సరే. అర్జంటుగా పట్రాండి" అన్నది సతాయింపు సారాంశం.

"ఇదిగో నేను ఖర్చు మనిషిని కాను. అదా మనిషిని. నిన్నటికి నిన్న పదిహేనువేలు అదా చేశాను'' అని రాంబాబు చెప్పేసరికి ''నిజం నాకోసమేనా'' అని సుబ్బలక్ష్మి సర్దాపడింది.

''నీకోసం కాకపోతే ఎవరికోసం?'' అని లంచం లాటి డైలాగు ...కురో కప్పు కాఫీ కొట్టేసాడు రాంబాబు.

... ఈవేళ ఆదివారం. సరదాగా ఎక్కడికన్నా తీసికెళ్ళండి'' అంటూ ...గారాలు పోయింది సుబ్బలక్ష్మి.

''షాపింగ్ చేయడం నాకు ఇష్టం ఉండదు. చెప్పానుగా అదా మనిషినని. విండో షాపింగ్ అని ఇంగ్లీషులో ఓ ముక్క ఉంది. బజార్లో అన్ని కొట్లూ తిరిగి అన్ని వస్తువులూ కళ్ళారాచూసి, చేతులారా కొనకుండా వచ్చేయడం అన్నమాట. అది చేద్దామన్నా సగటు మనిషి సెలవురోజు ఆదివారంనాడు బజార్లు నోళ్ల మూసుకుని వెలవెలబోతాయి. ఆదివారంనాడు కొట్లు మూసేయడం అనేది సగటు మనిషి సరదామీద సాడిస్టు పాలకులుతీసిన దొంగదెబ్బ. సినిమాలవీ తెరచి ఉంచడం అనేది సామాన్యుడి పర్సుమీద సాగిస్తున్న కుట్ర. వెళ్ళి వెళ్ళి కుట్రలో ఇరుక్కుందామా చెప్పు'' అని నిలేసాడు భార్యని.

సుబ్బలక్ష్మి బెంబేలు పడిపోయింది. పేపర్లో చదివే కుట్ర కేసులూ అవీ గుర్తొచ్చాయి. ''వద్దండీ, సెలవు రోజున సర్దాలూ అవీ లేకుండా కుట్రలో ఇరుక్కోడం ఎందుకు?'' అని చప్పున అలా బజారెళ్లే సర్దాని ఆర్పేసుకుంది.

రాంబాబు దిగ్విజయంగా నవ్వి "చెప్పానా అదా మనిషినని. నీకోసం లక్షలు కోట్లు అదా చేస్తాను. అన్ని సర్దాలూ ఒక్క పనితో తీరిపోయే ఏర్పాటు సృష్టిలో ఉంది. అదేమిటో చెబుతాను. గదిలోకిరా" అని బెడ్రూములోకి దారితీసాడు పొద్దున్నే.

"వళ్లు తోముకోకుండా సృష్టి రహస్యాలు మాట్లాడితే దేముడికోపం వస్తుంది" అని భయ పెట్టి వంటింట్లోకి వెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.

ఆ ఇంటికి రెండే గదులున్నాయి. ఆ రెండు గదుల్లోనే బెడ్రూముకీ, లివింగ్ రూముకీ, డైనింగ్ హాలుకీ వెళ్ళే చిట్కా ఆ దంపతు లిద్దరికే తెలుసు!

"చూడబోతే త్వరలోనే నేను అదాచేసిన డబ్బు అరలక్ష దాటొచ్చు. మొన్న పదిహేను వేలు అదాచేశానా? నిన్న 20 వేలు చేశాను" రాంబాబుకి కోరమీసం ఉంది. దాన్ని మెలేస్తూ చెప్పాడా ముక్క.

నేను మాటలు ఆదాచేసే మనిషినని చెబుతున్నట్టు కళ్ళతో ఆశ్చర్యం సంతోషం వెళ్లడించి మేలురకం బెండకాయలు చెకచెకా తరిగి పోయ డంలో పడింది సుబ్బలక్ష్మి.

అరలక్షతో ఏమేమి చేయవచ్చో ఆలోచిస్తోంది. పక్కింటి రాధా బాయి పొగరణిచేయొచ్చు ఇమీడియెట్‌గా!

గొప్ప సంతోషంతో బెండకాయలు అర్నిమిషంలో తరిగేసింది.

"అక్షరలక్ష ఆదా అయిం తరవాత బాన్ని ఏం చేద్దామంటారు? కుట్టలూ అవీ చెప్పకండి బాబూ'' అని నీలవేణిలా నవ్వుతూ అడిగింది.

''అరలక్షని అమట్న లక్ష చేద్దాం. లక్షని రెండు లక్షలు. అన్నట్టు కోటి అంటే వంద లక్షలే కదా?! ఏడాది తిరిగేసరికి మన ప్రథమ వివాహ వార్షికోత్సవం వస్తుంది. అప్పటికి మనం ఆదాచేసిన డబ్బు కోటి అవుతుంది'' అని కోరమీసం మెలేసాడు రాంబాబు. అక్కడినించి 'చిట్కా' ఉపయోగించి 'బెడ్‌రూము' లోకి వెళ్ళిపోయాడు.

బెండకాయల తరవాత ఉల్లిపాయలు తరిగిపోస్తూ రూపాయల గురించి ఆలోచించింది సుబ్బలక్ష్మి. బోలెడు అనుమానం వచ్చేసింది. ''కొంటె మనిషి బాబూ. నిజమో అబద్ధమో'' అని బెంగెట్టేసుకుని రివటలా లేచింది.

రాంబాబు ముసుగుతన్ని 'నిధి చాల సుఖమా' పాడుతున్నాడు.

దుప్పటి లాగివేసింది సుబ్బలక్ష్మి.

''నిజంగా మీరు మొన్న పదిహేనువేలూ, నిన్న ఇరవై వేలూ ఆదా చేశారా? నిజంగానే త్వరలో ఆరు లక్షలు ఆదా చేస్తారా? నిజంగానే కోటి రూపాయలు ప్రథమ వార్షికోత్సవం నాటికి కూడబెడతారా?! నిజంగానే. నిజంగానే??'' అని ఏ నిజం వినాల్సొస్తుందో అన్నట్టు నస్పెన్సు ముఖంపెట్టి నిలబడింది.

''నిజంగానే.... నిజంగానే.... ఎలాగో చెబుతాను విను'' అని సుబ్బలక్ష్మిని పక్కన కుదేసి ఆదా చిట్కా విప్పిచెప్పాడు.

''మొన్న బజార్లో సరికొత్త మోటార్ స్కూటర్ చూశాను. దాని ఖరీదు పదిహేనువేలు. నిన్న నువ్వు కట్టుకుంటే అదిరిపోయే గద్వాల చీర, నేను సొంతం చేసుకుంటే దిమ్మెత్తిపోయే సూటూ, బూటూ, మనింటి కొచ్చే అతిధులు కూర్చోడానికి సౌకర్యంగా ఉండే సోఫాసెట్టూ అదీ చూశాను. వాటి మొత్తం ఖరీదు 20 వేలు'' అన్నాడు రాంబాబు.

"ఛల్.... ఛల్...'' అని సుబ్బలక్ష్మి చప్పట్లు కొట్టింది.

"మొన్న చూసిన స్కూటర్ నేను కొనదల్చుకోలేదు. పదిహేను వేలు ఆదా. నిన్న చూసిన గద్వాల చీర, సూటూ, బూటూ, సోఫాసెట్టూ అదీ నేను చచ్చినా కొనను. ఇరవై వేలు ఆదా. ఇలా ఏడాదిలో కోటి రూపాయలు ఆదా. పో...పోయి వెంటనే కాఫీ పట్టా'' అని మళ్ళీ ముసుగుతున్ని 'నిధి చాల సుఖమా' ఎత్తుకున్నాడు రాంబాబు.

నస్పెన్సు విడిపోయిన సుబ్బలక్ష్మికి నవ్వినవ్వి ఫిట్టొచ్చేంత పనయింది!